# నలుగురు మూర్ఖులు

"**కా**లం చాలా మారిపోయింది. ఒకప్పుడు మనం విలువలనుకున్నవి, ఇప్పుడు విశ్వసించటానికి వీల్లేనివైపోయినాయి" అన్నాడు వెంకటాచలపతి ఉద్విగ్నంగా, పార్క్‌లోకి ప్రవేశిస్తూనే!

"ఏం జరిగిందేమిటి?" ఏదో ప్రమాదాన్ని శంకిస్తున్న వాడిలా ప్రశ్నించినాడు రామ్మూర్తి. అప్పటికే అక్కడికి చేరుకుని పచ్చికలో కూచున్న గంగాధరం, నరసింహమూర్తి, వీళ్ల వైపే ఆసక్తిగా ముఖాల్లోకి చూస్తున్నారు.

ప్రతి రోజూ సాయంత్రం ఆరుగంట లయేసరికి ఆ నలుగురూ రామనగర్ పార్క్‌కు చేరుకుంటారు. వాళ్లంతా రిటైర్డ్ ఉద్యోగులు! పాత పరిచయస్తులే!!

వెంకటాచలపతి హైస్కూల్ హెడ్మాస్టర్‌గా పని చేస్తూ ఉద్యోగవిరమణ చేసి ఆరు సంవత్సరాలయింది!

రామ్మూర్తి రెవిన్యూ డిపార్టుమెంట్‌లో పనిచేసి రిటైర్డ్ అయిన ఉన్నతోద్యోగి, గంగాధరం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీరుగా ఉద్యోగవిరమణ చేసినవాడు! నరసింహమూర్తి ఆరోగ్యశాఖలో పనిచేసిన వాడు! ఈ నలుగురూ ఉద్యోగ కాలం నుండీ కూడా ఎంతో కొంత స్నేహధర్మంతో అడపా దడపా కలుసుకుంటూనే ఉన్నారు. వీళ్లందరికి ఇళ్లూ కూడా రామనగర్ పార్క్‌కు సమీపంలో వున్న మారుతీనగర్‌లోనే వుండటం వల్ల వీళ్ల కలయిక ప్రతిరోజూ మరింత సులభంగా జరిగేది.

ఈరోజు పదినిమిషాలు ఆలస్యంగా వచ్చిన వెంకటాచలపతి, వచ్చీ రాగానే సంధించిన ప్రశ్న అందరికీ ఆసక్తిగానే వుంది. రామ్మూర్తి ఎదురు ప్రశ్న వేయనే వేసినాడు!

వెంకటాచలపతి వాళ్ల ముఖాల్లోకి చూస్తూ "మా బంధువుల కుర్రాడొకడు, జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. పేరు సురేష్! వాడు ఇటీవల ప్రేమలో పడ్డాడు. అది కూడా వన్‌సైడ్ లవ్! వాడు ప్రతి రోజూ ఒక అమ్మాయిని చూస్తూ, గమనిస్తూ, ఇలా సంవత్సరం గడిచేసరికి, తాను ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నానని

గుర్తించాడట! ఆ అమ్మాయి వివరాలన్నీ సేకరించాడట – ఒకే కులం – పేరు ప్రమోద – డిగ్రీ వరకూ చదువుకుంది – వాళ్ల నాన్న బ్యాంక్ ఉద్యోగి – పెళ్ళికి అభ్యంతరా లేముంటున్నా యనుకున్నాడు – ఉత్సాహం ఉరకలు వేసే వయస్సు – ఒక మిత్రునితో కలిసి ఒక రోజు వాళ్లింటికి వెళ్లాడు. తన గురించి వివరాలన్నీ చెప్పుకున్నాడు. ఆ అమ్మాయి కూడా వీడిని గుర్తుపట్టినట్టే మాటాడింది. పెళ్లి ప్రస్తావన తెచ్చినాడు – పెద్దవాళ్లను పంపమన్నారు. వీడి బావా, అక్కా వెళ్లి చూసి వచ్చినారు. మావాడు అందరిలాంటి వాడు కాడన్నారు – కట్నాలూ కానుకలూ తీసుకోడన్నారు. లాంఛనాలు వద్దన్నారు. ఆదర్శయువకుడు. ఆదర్శ వివాహం చేసుకుంటాడన్నారు. వారు ఏ సంగతీ మళ్లీ చెబుతామన్నారు. వారం తర్వాత ఈ సంబంధం మాకు వద్దన్నారు వాళ్లు. వీళ్లు నిర్ఘాంతపోయారు. నిన్న అసలు కారణం తెలిసింది. కట్నాలూ కానుకలూ, లాంఛనాలూ వద్దన్న కుర్రాడిని వాళ్లు అనుమానించినారట. ఏ కారణమూ లేకుండా, ఏ లోటు పాట్లూ లేకపోతే ఎవరైనా కట్నకానుకలు వద్దంటారా అని అనుమానంలో పడ్డారట. ఈ పెళ్లి మాకు ఇష్టం లేదని చెప్పి పంపినారు. ఇదీ సంగతి. ఒకప్పుడు దేన్నయితే ఆదర్శం అని సమాజం అంగీకరించిందో, ఆ ఆదర్శం ఈనాడు విశ్వసనీయతను కోల్పోయి అనుమానించదగ్గ విషయమైంది” అంటూ ముగించాడు.

రామ్మూర్తి వెంకటాచలపతి మాటలు విని “నిజమే! ఒకప్పుడు సంస్కరణోద్యమాల ఫలితంగా సాధించుకున్నవి, ఈనాడు అవహేళనకు గురి అవుతున్నాయి. ఒకప్పుడు కట్న కానుకలూ, లాంఛనాలూ లేకుండా చేసుకొనే వివాహాలు ఆదర్శ వివాహాలనిపించు కున్నాయి. ఇప్పుడవేవీ వద్దంటే అనుమానంగా చూస్తున్నారు. ఒకప్పటి ఆదర్శం ఇప్పుడు అవిశ్వసనీయమైపోయింది” అన్నాడు విచారాన్ని వ్యక్తం చేసే స్వరంతో!

గంగాధరం పెదవి చప్పరిస్తూ ఒక్క వివాహాల విషయమే కాదు. నీతీ నిజాయితీలు కూడా ఈనాడు అసమర్థత కింద జమకట్టబడుతున్నాయి. ఒకప్పుడు లంచగొండిని వేలెత్తి చూపించేవారు. ఇప్పుడు లంచం తీసుకోని వాడిని వేలేత్తి చూపించే పరిస్థితి దాపురించింది. ఒకప్పుడు వ్యక్తిగతమైన లంచం ఇప్పుడు వ్యవస్థీకృతమైంది. లంచం తీసుకోని ఉద్యోగి ఎక్కడైనా కన్పిస్తే మూర్ఛపోయేంత స్థితి వచ్చింది. ఒకప్పటి విలువలు ఇప్పుడు అనుమానించే స్థితికి చేరుకున్నాయి. మీకు ఒకసంఘటన చెబుతాను – వినండి” అన్నాడు.

మిగిలిన ముగ్గురూ ఆసక్తిగా గంగాధరం ముఖంలోకి చూసినారు. గంగాధరం ఒక నిట్టూర్పు లాంటిది విడిచి, “ఈ మధ్యనే రిటైర్డ్ అయిన నా మిత్రుడు పద్మనాభం పెన్షన్ పేపర్లను పై ఆఫీస్‌కు పంపించటానికి, సంబంధిత గుమాస్తా దగ్గరకు ఆరు నెలలుగా వెళ్తున్నాడు వస్తున్నాడు – పని మాత్రం జరగలేదు. ఏవేవో క్వొరీలు వేస్తున్నాడు సదరు గుమాస్తా! తెలిసిన వాళ్లు చెప్పింది కనీసం నాలుగైదు వేలు ఆ గుమాస్తాకు ముట్టచెబితే గాని పెన్షన్ పేపర్లు కదలవు అన్నారు. సరే, తప్పుతుందా అనుకొని డబ్బు సమకూర్చుకొని ఆ ఆఫీసులో సదరు సెక్షన్‌లోని సదరు గుమాస్తా టేబుల్ దగ్గరకు వెళ్లినాడు! ఆశ్చర్యం! ఆ సీటులో సదరు గుమాస్తా లేడు. ఒకకొత్త ఉద్యోగి, అందునా పాతికేళ్ల కుర్రాడు, ఆ సీటులో కూర్చుని ఉన్నాడట! దారి తప్పి వచ్చినానేమో అని దిక్కులు చూస్తుండగా ఆ సీటులో కూర్చున్న కుర్ర గుమాస్తా ఇతడిని పరకాయించి చూస్తూ – ‘ఏదేనా పని మీద వచ్చినారా? కూచోండి’ అన్నాడట. మా పద్మనాభం మరింత ఆశ్చర్యపోయినాడట. ఇన్ని నెలలుగా ఈ సీటు దగ్గరకు వచ్చినా పాత గుమాస్తా ఇతడిని కూచోమనలేదట. ఇతడు కుర్చీలో కూచుని తను వచ్చిన సీటు ఇదేనా అని అడిగానాడట. నేను నాలుగు రోజుల క్రితమే ఈ సీటుకు బదిలీ అయి వచ్చినానని ఆ యువకుడు తన్ను తాను పరిచయం చేసుకున్నాడట. ‘దయచేసి మీరు వచ్చిన పని చెప్పండి’ అని ఎంతో సభ్యతగా అడిగినాడట! మా పద్మనాభం ఆశ్చర్యం నుండీ తేరుకొని, తన పెన్షన్ పేపర్ల విషయం వివరంగా చెప్పినాడట! ఆరునెలలుగా ఈ పని మీద ఈ సీటు చుట్టూ తిరుగుతున్నానని కూడా చెప్పుకొన్నాడట. ఆ కొత్త గుమాస్తా విషయమంతా జాగ్రత్తగా విని, బీరువా అంతా వెదికి ఇతని ఫైల్ బయటకు తీసినాడట – ఫైలంతా జాగ్రత్తగా పరిశీలించి ‘మీరు నాలుగురోజులాగి రండి – మీ ఫైల్ సిద్ధం చేసి పెడతాను’ అన్నాడట. మా పద్మనాభం గత అనుభవాన్నంతా గుర్తుకు తెచ్చుకొని, అంతో ఇంతో ఇవ్వందే ఎవరు మాత్రం పనులు చేస్తారులే అనుకొని, నెమ్మదిగా అతని దగ్గరకువెళ్లి తల వంచి ఏమనుకోకండి. ఆరునెలలుగా తిరుగుతున్నాను. మూడు వేలు తెచ్చినాను. ఇది తీసుకొని దయచేసి నా పని తొందరగా చేసి పెట్టండి అన్నాడట! ఆ యువకుడు అంతా విని చిరునవ్వు నవ్వి చూడండి. ‘మీరు చాలా పెద్దవారు... ఇలా మాట్లాడకూడదు. ఈ సీటులో నేను చేయాల్సిన పనే పెన్షన్ పేపర్లు చూడటం! ఇందుకు ప్రభుత్వం నాకు పదివేలకు పైగా వేతనం ఇస్తున్నది. నాలుగు రోజుల పని ఇది! ఈ పని చేయటం నా విధి! ఇంకెప్పుడూ దయచేసి ఇలాంటి వాతావరణాన్ని కల్పించకండి. నాలుగు రోజులాగి

రండి. మీ పని పూర్తవుతుంది' అని నెమ్మదిగా చెప్పేసరికి మా పద్మనాభం ఉన్నపళంగా కుర్చీలోంచి కిందికి కుప్పగూలి పోయినాడట..." అంటూ పకా పకా నవ్వినాడు గంగాధరం!

"అంటే ఒక నిజాయితీ నేడు నమ్మరానిదయిందన్న మాట" అంటూ ముక్తాయింపు పలికాడు గంగాధరం!

నరసింహమూర్తి కలుగజేసుకొని, "మీరన్నట్టు ఆదర్శం అనుమానించే స్థితికి, నిజాయితీ నమ్మరాని గతికి నేడు చేరుకున్నాయి... ఇవే కాదు! మంచితనం, మానవత అనే విలువలు కూడా నేడు విశ్వసించరానివైపోయినాయి అంటే నమ్మండి. మీకు ఒక ఉదాహరణ చూపిస్తాను. నా మిత్రుడు రంగనాథానికి ఒక చిన్న కారుంది. ఒక రోజు అతడు నేషనల్ హైవే మీద కారు డ్రైవ్ చేస్తూ వెళ్తున్నాడు. కారులో అతడు ఒక్కడే వున్నాడు. ఒక బస్‌స్టాప్ దగ్గర భార్యాభర్తల జంట బస్సు కోసం వెయిట్ చేస్తూ నిలబడి వున్నారట! మన రంగనాథం. ఎటూ కారు ఖాళీగా వుంది గదా అని, కారును వాళ్ల దగ్గర ఆపి ఎక్కడికి వెళ్లాలి అని అడిగినాడట. అనంతపురం అన్నారట వాళ్లు. రండి నేను డ్రాప్ చేస్తాను అన్నాడట. ఆ మాట అనగానే వాళ్లు బిర్రబిగుసుకు పోయారట... ఫరవాలేదు రండి మాదీ అనంతపురమే అని పిలిచినాడట. ఆ భార్యాభర్తలు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు... ఇతడు మరోసారి బలవంతపెట్టేసరికి, ఆ భర్త 'సారీసార్! పది నిముషాల్లో బస్సు వస్తుంది. మీరు వెళ్లండి' అంటూ కారు ఎక్కడానికి నిరాకరించినారట! వాళ్ల మాట తీరూ, ముఖకవళికలూ చూసే సరికి మా రంగనాథానికి విషయం అర్థమై పోయింది. వాళ్ళు తనను నమ్మడం లేదని అతనికి తెలిసిపోయింది.... తనేమైనా చేస్తాడేమోనని వారు బెదరిపోయి వుంటారు. ఆ భార్య మెడలో బంగారు గొలుసులు కూడా వున్నాయట. మా రంగనాథం నిట్టూర్చి తాను మరేమీ మాటాడకుండా వచ్చేశాడట! ఇదీ సంగతి! ఎదుటి మనిషిలోని మంచితనాన్ని నమ్మలేని స్థితికి మన సమాజం చేరుకుంది' అంటూ ముగించినాడు నరసింహమూర్తి.

రామ్మూర్తి వాళ్ల ముగ్గురి అనుభవాలు వింటూ "అయ్యో! నిజమే! ఇది వ్యక్తుల తప్పు కాదు! ఇన్నేళ్ల తర్వాత మనుషుల్ని ఈ స్థితికి తెచ్చిన సమాజ వ్యవస్థలోని లోపాలది ఈ తప్పు! జీవితంలో అందరికీ ఎదురయ్యే అనుభవాలే ఇవి! మొన్నటికి మొన్న నేను దారిలో వెళ్తుండగా ఒక ఇల్లాలు నాలుగేళ్ల తన కూతుర్ని నడిపించుకుంటా

నాకు ఎదురు వచ్చింది. ఆ పసిపాపను చూసి నేను ఎంతో ముచ్చటగా నా జేబులో వుండే నాలుగు చాక్లెట్లను తీసి ఆ పాప చేతిలో వుంచినాను. ఆ తల్లి వద్దండీ అని వారించినా నేను ఆ పసిపాప బుగ్గ నిమిరి పరవాలేదమ్మా అని ఆ చాక్లెట్లు ఇచ్చినాను. ఆ తర్వాత ఏం జరిగిందంటే, నేను కొంత దూరం వెళ్లాక వెనక్కి తిరిగి చూద్దునుగదా, ఆ తల్లి తన కూతురు చేతిలోని చాక్లెట్లను తీసుకొని ప్రక్కనున్న సైడ్‌కాలువలోకి విసిరేసింది–'ఏమో! ఆ చాక్లెట్లలో ఏముందో, ముక్కూ మోహమూ తెలియని వ్యక్తి ఆయాచితంగా ఎందుకిస్తాడు అనుకుందేమో! ఇదీ సంగతి! ఏమంటారు మీరు! ఎదుటి మనిషిలోని కించిత్తు సౌజన్యాన్నే నమ్మలేక పోతున్నారనే గదా!' అన్నాడు.

నాలుగు నిమిషాల నిశ్శబ్దం తర్వాత వెంకటాచలపతి 'ఒక ఆదర్శాన్ని, ఒక నిజాయితీని, ఒక మంచితనాన్ని, ఒక సౌజన్యాన్ని నమ్మ లేని స్థితికి మన సమాజం వచ్చేసిందన్నమాటే గదా! మనం ఎక్కడికి ప్రయాణం చేస్తున్నాము? ఎవరు మనల్ని ఈ విధంగా నడిపిస్తున్నారు. ఆలోచిస్తూ వుంటే భవిష్యత్తు మరింత చీకటిగా కన్పిస్తూ వుంది" అంటూ నిట్టూర్చినాడు.

చీకటి పడబోతోంది. ఆ నలుగురూ లేచి నిలబడ్డారు దుమ్ముదులుపుకుంటూ – వాళ్లు నాలుగు అడుగులు వేసేసరికి చీకటి మరింత చిక్కబడింది.

**❖ చినుకు, మాసపత్రిక, ఏప్రిల్ 2010**